# ముఖ్యమంత్రి కార్యాలయము

## తెలంగాణ ప్రభుత్వం

పత్రికా ప్రకటన-1 తేదీ: 1-11-2014

సామాజిక కార్యకర్త, ఉద్యమ కారుడు, సాహితీవేత్త, రచయిత, గ్రంథాలయ ఉద్యమ సారథిగా బహుముఖ పాత్రలు పోషించిన వట్టికోట ఆళ్వారు స్వామి అని తెలంగాణ జాతి గర్వించతగ్గ యోధుడు ముఖ్యమంత్రి కె. చంద్రశేఖర్ రావు కొనియాడారు. ఆళ్వారు స్వామి శతజయంతిని పురస్కరించుకుని ముఖ్యమంత్రి ఆయనకు ఘన నివాళి అర్పించారు. ఆయన తెలంగాణ జాతికి, యావత్ సమాజానికి చేసిన సేవలను గుర్తుకు తెచ్చారు. తెలంగాణ సామాజిక, సాహిత్య వికాసానికి వట్టికోట ఆళ్వారుస్వామి ఎనలేని కృషి చేశారని ముఖ్యమంత్రి అన్నారు. అణచివేతకు వ్యతిరేకంగా అనన్య సామాన్యమైన పోరాటం చేసిండని, జైలుశిక్ష కూడా అనుభవించారని, ఎలాంటి కష్టానికైనా వెరవలేదని ముఖ్యమంత్రి చెప్పారు. తెలంగాణ ప్రజల భావనలు, బాధలు ప్రతిబింబించేలా 'ప్రజల మనిషి' అనే నవలతో పాటు అనేక కథలు కూడా రాశారన్నారు. గ్రంథాలయ ఉద్యమానికి వట్టికోట చేసిన కృషి మరవలేనిదని, నెత్తిన పుస్తకాలు పెట్టుకుని ఊరూరా తిరిగి చైతన్యాన్ని వ్యాప్తి చేశారని కొనియాడారు. వర్తక సంఘాలను, రిక్షా కార్మిక సంఘాలను, పౌర హక్కుల సంఘాలను ఆ కాలంలోనే స్థాపించారన్నారు. తెలంగాణకు సంబంధించిన సామాజిక విశ్లేషణలతో కూడిన వ్యాస సంకలనాలను తీసుకొచ్చారని చెప్పారు. ఎన్నోరకాల సేవలు చేసిన మహావ్యక్తి అయినప్పటికీ వలస పాలనలో వట్టికోట గారి గొప్పతనం చీకట్లోనే ఉండిపోయిందన్నారు. వట్టికోట చరిత్ర, గొప్పతనం చరిత్రలో చిరస్థాయిగా నిలిచే విధంగా ప్రభుత్వం తగిన చర్యలు తీసుకుంటుందని ప్రకటించారు. తన వ్యక్తిగత గ్రంథాలన్నింటినీ సిటీ సెంట్రల్ లైబ్రరీకి ఇచ్చి, బావి తరాలకు ఉపయోగపడేలా చేశారన్నారు. సిటీ సెంట్రల్ లైబ్రరీకి వట్టికోట ఆళ్వారు స్వామి పేరు పెడతామని, అదే లైబ్రరీ ప్రాంగణంలో వట్టికోట విగ్రహాన్ని ఏర్పాటు చేస్తామని వెల్లడించారు. వట్టికోట స్వస్థలం నల్గొండ జిల్లా నకిరేకల్ మండలం చెరువు మాదారంలో కూడా విగ్రహం పెడతామని చెప్పారు. వట్టికోట సాహిత్యాన్నంతా ఓ సంకలనంగా మార్చి, తెలుగు అకాడమీ ద్వారా ప్రచురిస్తామని ప్రకటించారు.

---

సిపిఆర్ఓ టు సిఎం